# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284



**జరిగిన కథ :** రాజప్రాసాదంలోని అంతఃపురంలోకి వెళ్లబోతూ.. ఆ ద్వారాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఇప్పుడు ఒక్కటే ద్వారం! మొన్న వచ్చినప్పుడు అక్కను చూడాలన్న తొందరలో అప్పుడు గుర్తించలేదు. అంటే.. బావగారు రెండు అంతఃపురాలు ఏకం చేశారన్నమాట. గతంలో హరిహరుని మరణవార్త అందినప్పటి సంఘటన గుర్తొచ్చింది. అద్దంకి, పాకనాడు రాజ్యాల మత గొడవల సమయంలో.. ఆ దుర్వార్త తెలిసి, భారంగా కుప్పకూలిపోయాడు జాయపుడు. అక్కకు, బావగారికి గర్భ శోకం!

అస్థిరం జీవనంలోకే అస్థిరం యౌవనం ధనం।
అస్థిరం దారాపుత్రాది ధర్మ కీర్తి ద్వయం స్థిరం॥
(ఈ జీవితం, యవ్వనం, ధనం, భార్యాబిడ్డలు కూడా శాశ్వతం కాదు. ధర్మం.. తద్వారా పొందిన కీర్తి మాత్రమే శాశ్వతం!)

ఎవ్వరికీ చెప్పకుండా హుటాహుటిన అనుమకొండకు వెళ్లాడు. దీర్ఘకాల జబ్బుతో ఉన్న పార్థివదేహం కాబట్టి అప్పటికే హరిహరదేవుని దహన సంస్కారాలు చేసేశారు.

అంతఃపురంలోకి వెళ్లాడు. ఆశ్చర్యంగా సవతులిద్దరూ ఒకే అంతఃపురంలోనే కాదు.. ఒకే మందిరంలో వేర్వేరు గదులలో ఉంటూ ఆప్యాయంగా కనిపించారు. ఇంకా ఆశ్చర్యమేమిటంటే.. సోమలదేవి అనారోగ్యంతో మంచాన పడగా, ఇన్నేళ్లుగా ఎవరినైతే అసహ్యించుకున్నదో ఆ సవతి నారాంబే సపర్యలు చేస్తున్నది. గర్భశోకాన్ని భరిస్తూ. జాయపుడు వెళ్లేసరికి మందిరమంతా భరించలేని దుర్గంధం. తల్పం వద్ద సోమలదేవికి వైద్యం చేస్తున్న రాజవైద్యుడు అన్నంభట్టు.. దగ్గరగా నారాంబ, కాస్త ఆవలగా చక్రవర్తి గణపతిదేవుడు, పక్కన పెద్దకుమార్తె గణపాంబ. అందరూ ముక్కులకు గుడ్డలు కట్టుకుని ఉన్నారు.

జాయపుడు ప్రవేశించగానే అందరూ తలతిప్పి చూశారు. జాయపుడు చక్రవర్తికి నమస్కరించగా వైద్యుడు జాయపునికి నమస్కరించాడు. సోమలదేవిని పలకరించాలంటే కాస్త తటపటాయించాడు జాయపుడు.

అప్పుడు వినిపించింది ఘొల్లుమన్న సోమలదేవి గొంతు. ఆమె వెక్కివెక్కి ఏడుస్తున్నది. గణపతిదేవుడు గబగబా దగ్గరికి వెళ్లాడు.

‘‘సోమలా.. ఎందుకా దుఖం? తగ్గిపోతుంది. వైద్యులు మంచి చూర్ణాలు, మూలికలు వాడుతున్నారు. కాస్త ఓపిక చేసుకో! భరించాలి కదా!?’’.

‘‘భరిస్తాను. నా ఒంట్లో జబ్బు, దాని నొప్పి భరిస్తాను. కానీ నా మనసులో జబ్బు.. దాని నొప్పినే భరించలేక పోతున్నాను స్వామీ! నారాంబకు నేను చేసిన ద్రోహం నన్ను దహిస్తున్నది. ఆమెను చిత్రహింసలు పెట్టాను. ఆమె కొడుకుల్ని చూసి నా కళ్లలో నిప్పులు పోసుకున్నాను. వాళ్లను చంపించడానికి కూడా ప్రయత్నించాను. ఆమె గర్భశోకానికి నేనే కారణం. నా వల్లనే ఆమె కొడుకు చనిపోయాడు. అయినా ఆమె నా బాగు కోరింది. నేను మంచాన పడితే అంత బాధలో కూడా ఆమె నాకు సపర్యలు చేస్తున్నది. నారాంబా.. నన్ను క్షమిస్తావా!?’’ సోమలదేవి దుఖంతో కుమిలిపోవడం జాయపుణ్ని చకితుణ్ని చేసింది.

ఆమె ఏదో నిగూఢమైన జబ్బుబారిన పడింది. ఆమె శరీరం నుంచి దుర్గంధం వస్తున్నది. పరిచారికలు, దాసీలు కూడా ఆమె సామీప్యంలో ఉండలేక పోతున్నారు. అయినా నారాంబ ఆమెకు సపర్యలు చేస్తున్నది.

ఆమె మందిరంలో రెండు తల్పాలు. ఒకదానిపై హరిహరదేవుణ్ని, మరో తల్పంపై సోమలదేవిని ఉంచి ఇద్ద